గ్లామన్ మిసెస్ ఇండియాగా హేమలతారెడ్డి

ఖైరతాబాద్, సెప్టెంబర్ 29 : గ్లామన్ మిసెస్ ఇండియా అవార్డును టీవీ జర్నలిస్టు, యాంకర్, సినీ నటి హేమలతారెడ్డి దక్కించుకున్నారు. మలేషియాలో జరిగిన మిసెస్ ఇండియా-24 వేడుకల్లో బెస్ట్ టాలెంట్ అండ్ ఫొటోజెనిక్ విభాగంలో ఆమె ఈ అవార్డును గెల్చుకున్నారు.

రాజ్యాధికారమే.. బీసీల లక్ష్యం

- తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర

ఖైరతాబాద్, సెప్టెంబర్ 29 : బీసీలు జెండాలు మోసి అగ్రవర్ణ నేతలను గెలిపించే సమయం పోయిందని.. రాజ్యాధికారమే తమ ముందున్న లక్ష్యమని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు సీహెచ్ ఉపేంద్ర అన్నారు. బీసీ టైమ్స్, బీసీ సమాజ్ సంయుక్తాధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఉపేంద్ర మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కులగణన, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనన్నారు. తమిళనాడులో జరిగిన బీసీ ఉద్యమం స్ఫూర్తిగా తెలంగాణలోని బీసీలంతా ఉద్యమాలు చేపట్టాలని, బీసీ నేతలనే గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. బంగారు నరసింహ సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు, కార్యదర్శి ఎం. శ్రీనివాస్ సాగర్, ఓర్సు కృష్ణయ్య, సత్యనారాయణ రాజు, అంతయ్య, దేవేందర్, బీసీ సమాజ్ ఎంప్లాయిస్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, శివానీ తదితరులు పాల్గొన్నారు.

లేక్ వ్యూ పార్కులోకి మురుగునీరు!

- సమీప కాలనీల్లో వరదనీటిని పైపులైన్ ద్వారా పార్కులోకి వదులుతున్న అధికారులు
- డ్రైనేజీ నీరు పైపులైన్‌లో కలిసి దుర్గంధం వ్యాపిస్తుందని వాకర్స్, బస్తీవాసుల ఆందోళన
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

లేక్ వ్యూ పార్కులో చేరిన వరద, మురుగు నీరు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 29: నిత్యం వందలాది మంది సందర్శించే ఖైరతాబాద్‌లోని లేక్ వ్యూ పార్కు మురికికూపంగా మారుతున్నది. గత వారం రోజులుగా లేక్ వ్యూ పార్కులోని కొలనులో మురుగునీరు చేరి దుర్గంధం వ్యాపిస్తున్నది. ఫలితంగా వాకర్స్, వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. పార్కులో కూర్చున్న వారికి దోమలు ప్రతాపం చూపుతున్నాయి. పార్కులో ఓ వైపు వీధి కుక్కలు స్వైర విహారం చేస్తుండగా, మరో వైపు దుర్గంధంతో వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు.

కోట్లు కుమ్మరించినా ఫలితమేదీ..

ఖైరతాబాద్‌లోని ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్, చుట్టుపక్కల కాలనీల్లో వరద ముంపు సమస్యను పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ సర్కిల్-17 ఇంజినీరింగ్ అధికారులు పైపులైన్లు, సంపులు, మోటర్లు, బాక్స్ డ్రైన్ల ఏర్పాటు కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టారు. కోట్లు ఖర్చు చేసినా వరదనీటి సమస్యకు మాత్రం నేటికీ శాశ్వత పరిష్కారం దొరకలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్ మరోసారి జలమయమైంది. ఆ నీటిని క్రమపద్ధతిలో తొలగించే మార్గం దొరకక రోజుల తరబడి వర్షపు నీరు అలాగే నిలిచిపోయింది. దాంతో స్థానికులు ఫిర్యాదులు చేయడంతో అధికారులు చివరికి మోటర్ల సాయంతో వర్షపు నీటిని లేక్ వ్యూ పార్కులోకి వదిలారు. అయితే ఆ నీటిలో డ్రైనేజీ నీరు కలుస్తున్నదని దాంతో దుర్గంధం వస్తున్నదని లేక్‌వ్యూ పార్క్ పరిధిలోని బస్తీ వాసులు ఆరోపిస్తున్నారు. కోట్లు ఖర్చు చేసినా వరదనీటి సమస్యకు ఇప్పటికీ పరిష్కారం దొరకలేదు. అంతేకాకుండా బాక్స్‌డ్రైన్, సంపు పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

అధికారుల సమన్వయ లోపం..

జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు కాలనీల్లో చేరిన వరద నీటిని హెచ్ఎండీఏ పరిధిలోని లేక్ వ్యూ పార్కులోకి పంపించే ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం వరద నీరు తగ్గినా అందులో నుంచి డ్రైనేజీ నీరు వస్తున్నది. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారుల మధ్య సమన్వయ లోపంతోనే వరదనీటి లైన్‌లో డ్రైనేజీ నీరు కలుస్తున్నదని బస్తీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని లేక్ వ్యూ పార్క్ పరిధిలోని బస్తీ వాసులు కోరుతున్నారు.

బాల సాహిత్యంతో మనోవికాసం

హిమాయత్‌నగర్‌లో బాలచెలిమి మాస పత్రికను ఆవిష్కరిస్తున్న వేదకుమార్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ తదితరులు

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 29 : బాల సాహిత్యం పిల్లలకు మనోవికాసం కలిగించి విజ్ఞానం పెంచుతుందని చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ అధ్యక్షుడు మణికొండ వేదకుమార్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ ఆవరణలో బాల చెలిమి గ్రంథాలయాల నిర్వహణపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల చెలిమి గ్రంథాలయాలతో విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచి రచనల పట్ల మక్కువ పెంచుకునేలా కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే 15 జిల్లాలలో బాల చెలిమి గ్రంథాయాలను ఏర్పాటు చేశామని, మరో వంద ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ.. బాల సాహిత్యాన్ని మరింత పెంచేలా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. అనంతరం బాల చెలిమి ముద్రించిన మాస పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిద్ధిపేట డిగ్రీ కాలేజీ లైబ్రేరియన్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, సిటీ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్, రచయిత్రి డాక్టర్ అమరవాది నీరజ, మహా అకాడమీ డైరెక్టర్ మల్లికార్జునరావు, సంఘ సేవకుడు రాజలింగం, ప్రతినిధి చంద్రమోహన్, బాల చెలిమి గ్రంథాలయ రాష్ట్ర కన్వీనర్ గరిపల్లి అశోక్ కుమార్, కోఆర్డినేటర్ ఖైజర్ భాషా పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో కళా మహోత్సవ్

కళా మహోత్సవ్ వేడుకల్లో ఏర్పాటు చేసిన స్టాల్స్

బొల్లారం, సెప్టెంబర్ 29: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్ ప్రదర్శనకు మొదటి రోజు సందర్శకులను ఆకర్షించింది. దేశంలో ఈశాన్య రాష్ట్రాల సుసంపన్నమైన, వైవిధ్య భరితమైన సంస్కృతిని పురస్కరించుకొని కలర్స్ ఆఫ్ ది నార్త్ ఈస్ట్ అనే పేరుతో ఆకర్షణీయమైన నృత్య ప్రదర్శనతో ప్రారంభించినట్టు నిలయం అధికారి రజనీప్రియ వెల్లడించారు. 8 రాష్ట్రాల నుంచి సంప్రదాయ నృత్య రూపాలను, నృత్య కళాకారులు అలరించారు. హస్తకళలను వీక్షించడానికి ప్రజలు విచ్చేశారు. ప్రధానంగా తామర పట్టు నేయడం, కుండలు, బుట్టలు అల్లిక వంటి స్వదేశీ క్రాఫ్ట్స్ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలు అక్టోబర్ 6వరకు కొనసాగుతాయని రజనీప్రియ తెలిపారు.

నోవోటెల్‌లో ఉత్సాహంగా కేక్ మిక్సింగ్ వేడుక

కేక్ మిక్సింగ్ చేస్తున్న నోవోటెల్ హోటల్ సిబ్బంది

ద్రాక్ష పండ్లను తొక్కుతున్న చిన్నారులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 29 : శంషాబాద్ ఎయిర్‌పోర్టు నోవోటెల్ హోటల్‌లో క్రిస్మస్ పండుగకు ముందస్తుగా ఆదివారం కేక్ మిక్సింగ్ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. అతిథులతో పాటు హోటల్ సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నోవోటెల్ జనరల్ మేనేజర్ సుఖ్‌బీర్‌సింగ్ మాట్లాడుతూ.. కేక్ మిక్సింగ్ వేడుక ప్రత్యేక సంప్రదాయమన్నారు. గత 13 ఏండ్లుగా ఈ వేడుకను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ద్రాక్ష పండ్లతో పాటు విస్కీ కలిపి తయారు చేసే ఈ కేక్‌ను క్రిస్మస్ సందర్భంగా విక్రయిస్తామన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉన్న నోవాటెల్‌కు రోజురోజుకు అతిథులు పెరుగుతున్నారని వివరించారు. వేడుకలలో పలువురు యువతీయువకులు, చిన్నారులు, హోటల్ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా స్కాలర్‌షిప్ టెస్ట్

టెస్టును పరిశీలిస్తున్న అకాడమీ నిర్వాహకురాలు బాలలత

చిక్కడపల్లి, సెప్టెంబర్ 29: సివిల్స్ తమ లక్ష్యంగా పెట్టుకున్న గ్రామీణ ప్రాంత యువతను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ, టైలరో ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించారు. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాలలత మాట్లాడుతూ ఈ టెస్టులో సుమారు 2500 మంది హాజరయ్యారని, టాప్ 10 విజేతలకు తమ అకాడమీలో ఉచితంగా సివిల్స్ కోచింగ్ ఇవ్వనున్నట్లు జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా టాప్ 100 వచ్చిన వారికి ఉచితంగా సివిల్స్ మెటీరియల్స్‌ను అందిస్తామని తెలిపారు. ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు తమ లక్ష్యాన్ని చేరుకోడంలో తమ వంతు వారికి ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆమె తెలిపారు.

317 జీవో బాధిత ఉద్యోగుల సమస్యలు పట్టించుకోరా?

- 2న చలో గాంధీ భవన్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 29 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే గాంధీ జయంతి లోపు 317 జీవో బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఆ ఊసే ఎత్తడం లేదని జేఏసీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. ఖైరతాబాద్‌లోని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఆవరణలో పలువురు జేఏసీ నాయకులు ప్లకార్డులను ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాడు టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో హామీ ఇచ్చారని, మరో రెండు రోజుల్లో గాంధీ జయంతి వస్తున్నదని, ఆలోగా హామీని నిలబెట్టుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 2న చలో గాంధీ భవన్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాగేశ్వర్‌రావు, మధుసూదన్‌రెడ్డి, సందీప్, చాముండేశ్వరి, వినోద, జెస్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

పేదలకు అండగా ఉండే పార్టీ.. బీఆర్ఎస్

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అప్పారెడ్డి ముఖేశ్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు అత్తాపూర్ రాక

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 29 : పేదలకు అండగా ఉండే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అప్పా రెడ్డి ముఖేశ్ అన్నారు. ఆదివారం సాయంత్రం అత్తాపూర్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లను కూల్చేందుకు కుట్రలు చేస్తుందన్నారు. దీనిని తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, గంగుల కమలాకర్, మల్లారెడ్డి తదితరులు బండ్లగూడ బాధితులను పరామర్శించినట్లు పేర్కొన్నారు. బాధితుల సమస్యలను తెలుసుకోని వారి పక్షాన పోరాడతామని స్పష్టం చేశారన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం సాయంత్రం 5.30 గంటలకు అత్తాపూర్ మూసీ పరీవాహక ప్రాంతానికి రానున్నట్లు తెలిపారు. భరత్‌నగర్, అత్తాపూర్, అంబియన్స్‌ఫోర్ట్ తదితర ప్రాంతాల బాధితులతో సమావేశమై మాట్లాడతారని అన్నారు. అలాగే అంబియన్స్‌ఫోర్ట్ వద్ద భారీ సభ నిర్వహించనున్నారని, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు,కార్యకర్తలతో పాటు బాధితులు హాజరుకావాలని కోరారు. ఆయన వెంట గుర్రంపల్లి యాదగిరి, లక్ష్మణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలి

- ఆటో డ్రైవర్స్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్

మాట్లాడుతున్న మహ్మద్ అమానుల్లాఖాన్

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 29: నగరంలో రోజురోజుకు జరిలమవుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహ్మద్ అమానుల్లా ఖాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. నగరంలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో వేలాదిమంది నరకయాతన అనుభవిస్తూ విలువైన సమయాన్ని ప్రయాణంలో గడుపుతున్నారని అన్నారు. ట్రాఫిక్ జామ్‌లతో వాహనకాలుష్యం పెరిగిపోతుందన్నారు. రోడ్లను విస్తరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆయన ఆరోపించారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత పటిష్టపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో ఆటో జేఏసీ నాయకులు సయ్యద్, హుస్సేన్, లతీఫ్ ఖదీర్, మక్బూల్, అమీన్, అఫ్రోజ్, అక్తర్ పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

కాటేదాన్‌లో బీజేపీ సభ్యత్వం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 29: ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాటేదాన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలు వురికి కార్పొరేటర్ సభ్యత్వాలను అందజేసి మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్దన్, అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్‌యాదవ్, రావుల భాస్కర్, ఎన్ము శ్రీనివాస్‌రెడ్డి, మురళీధర్ రెడ్డి, జగన్, బబ్లూ, శంకర్‌రెడ్డి, రామారావు, నర్సింహారెడ్డి, మజర్, షకీల్, హన్మంతరెడ్డి, రాజ్‌కుమార్, సురేశ్, అంజమ్మ, నందిని, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో..

అత్తాపూర్‌లో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. హైదర్‌గూడ శివానగర్ కాలనీలో సభ్యత్వాలు అందజేశారు. అనంతరం డివిజన్ కిసాన్ మోర్చా అధ్యక్షుడు మల్లేశ్ ఇంట్లో ప్రధాని నరేంద్రమోడీ మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా 114వ ఎపిసోడ్‌ను వీక్షించారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్, జయానంద్‌రెడ్డి, శ్రీనివాస్, అనిల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బైకులు ఢీ.. భార్యాభర్తలకు గాయాలు

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 29: బోరబండ పీఎస్ పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని భార్యాభర్తలకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. బోరబండ మధురానగర్‌కు చెందిన శివాజీ,ప్రశాంతి దంపతులు ఆదివారం ద్విచక్ర వాహనంపై మోతీనగర్- కల్యాణ్‌నగర్ మార్గంలో వెళ్తున్నారు. అదేసమయంలో రాంగ్ రూట్లో వస్తున్న మరో ద్విచక్రవాహనం వారి బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివాజీ, ప్రశాంతికి స్వల్ప గాయాలయ్యాయి. అయితే రాంగ్ రూట్లో వచ్చిన వ్యక్తి పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించి నిందితుడిని పట్టుకుంటామని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పక పాటించాలని పోలీసులు సూచించారు.

గాయపడిన చిన్నారి చికిత్స పొందుతూ మృతి

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 29: మంచంపై ఆడుకుంటున్న చిన్నారి ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్రగాయాలు కాగా దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. బోరబండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సీఆర్ హిల్స్ ఆశయ్యనగర్‌కు చెందిన సురేశ్ కుమార్తె హాసిని(3) ఈ నెల 12న ఇంట్లోని మంచంపై ఆడుకుంటూ కిందపడిపోయింది. తలకు తీవ్ర గాయాలవడంతో కుటుంబసభ్యులు చిన్నారిని వెంటనే నీలోఫర్ దవాఖానాలో చేర్పించారు. అయితే ఆదివారం చికిత్స పొందుతూ చిన్నారి హాసిని మృతిచెందింది. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 29: చికిత్స కోసం దవాఖానకు వచ్చిన మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన సంఘటన బోరబండ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మల్లేపల్లి అఫ్జల్‌నగర్‌కు చెందిన గణేశ్‌కు మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో శనివారం ఆయన బంధువు ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయానికి తీసుకొచ్చాడు. వైద్య పరీక్షల అనంతరం గణేశ్‌ను ఓపీ విభాగంలో బల్లపై కూర్చోబెట్టి మందుల కోసం కౌంటర్ వద్దకు వెళ్లాడు. అదే సమయంలోనే గణేశ్ అక్కడి నుంచి మాయమయ్యాడు. పరిసరాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన జోనల్ స్థాయి పాఠశాలల క్రీడలు

- నాలుగు ప్రథమ బహుమతులు గెల్చుకున్న బోరబండ టీజీఆర్ఎస్ విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందజేసిన డిప్యూటీ డీఈఓ శామ్యూల్ రాజ్ తదితరులు

జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 29: హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జోనల్ స్థాయి ఇంటర్ స్కూల్ గేమ్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. గత మూడు రోజులుగా జరిగిన ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థుల ఖోఖో పోటీల్లో బోరబండ టీజీఆర్ఎస్ వరుసగా నాలుగు ప్రథమ బహుమతులు గెల్చుకుని సంచలనం సృష్టించింది. ఖోఖో అండర్-14, 17 బాలికల విభాగాల్లో బోరబండ టీజీఆర్ఎస్ వరుసగా ప్రథమ స్థానాలు కైవసం చేసుకోగా బాలుర అండర్-14 విభాగంలో రాజ్ భవన్ జీహెచ్ఎస్, అండర్-17 బాయ్స్‌లో జూబ్లీహిల్స్ ఎంజేపీటీ ప్రథమ స్థానాల్లో నిలిచాయి. కబడ్డీలో అండర్-14 బాయ్స్ జీహెచ్ఎస్ బంజారాహిల్స్, అండర్-17 విభాగంలో ఎంజేపీటీ జూబ్లీహిల్స్ ప్రథమ స్థానాల్లో నిలిచాయి. కబడ్డీ అండర్-14, 17 బాలికల విభాగాల్లో బోరబండ టీజీఆర్ఎస్ వరుసగా ప్రథమ స్థానాలు కైవసం చేసుకుని చాంపియన్‌గా నిలిచింది. విజేతలకు జిల్లా ఉప విద్యాధికారి శామ్యూల్‌రాజ్, క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ విశ్వేశ్వర్‌రావు, డిప్యూటీ ఐఓఎస్‌లు కొర్స యాదగిరి, పి.పరమేశ్వరమ్మ, శ్రావణ్‌కుమార్ బహుమతులు అందజేశారు.

బంజారాలకు మంత్రి వర్గంలో చోటేదీ?

- బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రనాయక్

సమావేశంలో అభివాదం చేస్తున్న బంజారా సేవా సంఘం నాయకులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 29 : రాష్ట్రంలో 40లక్షలకు పైగా జనాభా ఉన్న బంజారాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గంలో చోటు కల్పించలేదని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ రామచంద్రనాయక్ అన్నారు. ఖైరతాబాద్‌లోని గిరిజన విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బంజారాలను పూర్తిగా విస్మరించిందని, కేవలం వారిని ఓటు బ్యాంకుగానే చూస్తున్నదన్నారు. ఎస్‌టీలకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని, రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర శాసనసభలో తీర్మాణం చేయాలన్నారు. గోర్బోలి భాషకు అధికార హోదా కల్పించాలని, అందుకు ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలన్నారు. త్వరలోనే దీనిపై ప్రధాని, రాష్ట్రపతిని కలుస్తామని ఆయన పేర్కొన్నారు. గిరిజనులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. రాబోయే రోజుల్లో తమ హక్కుల కోసం అన్ని గిరిజన సంఘాలను కలుపుకుని ఆందోళన చేస్తామన్నారు.

సమావేశంలో ఏఐబీఎస్ఎస్ అసోసియేట్ అధ్యక్షుడు మోహన్‌సింగ్ నాయక్, పాండురంగ నాయక్, శ్యామ్‌నాయక్, కిషన్ నాయక్, రాంబాబు నాయక్, తారాచందర్, బాబురావు, శేఖర్‌నాయక్, ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

నేరేడ్‌మెట్, సెప్టెంబర్ 29: వినాయకనగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తామని కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. డివిజన్‌లో తూర్పు ఆనంద్‌బాగ్‌లో సుమారు రూ. 11లక్షలతో పార్కును అభివృద్ధి చేసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న ఎలాంటి సమస్యలున్నా నా దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

- మల్కారం పీఏసీఎస్ చైర్మన్ బుర్కుంట సతీశ్

సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ బుర్కుంట సతీశ్

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 29 : రైతు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్, మల్కారం పీఏసీఎస్ చైర్మన్ బుర్కుంట సతీశ్ తెలిపారు. ఆదివారం శంషాబాద్ మండలం మల్కారం పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సతీశ్ మాట్లాడుతూ.. మల్కారం సహకార సంఘం ఇప్పటికే రూ. 19 కోట్ల టర్నోవర్ దాటిందని తెలిపారు. సంఘం పరిధిలోని రైతులంతా స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. సంఘంలోని సభ్యులకు లక్షలాది రూపాయల పంటరుణాలు, అదేవిధంగా రూ. 3 కోట్ల వరకు దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేశామని తెలిపారు. 161 మంది రైతులకు రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా తమ రుణాలను మాఫీచేయాలని పలువురు డిమాండ్ చేశారు. సమావేశంలో సహకార సంఘం డైరెక్టర్లు రవికాంత్‌రెడ్డి, లక్ష్మీకృష్ణారెడ్డి, శంకరయ్య, రెడ్యా, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ ఇండ్లు అందించేందుకు కృషి

కార్పొరేటర్ సీఎన్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కమలానగర్ వాసులు

జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 29 : కమలానగర్‌లో అర్హులందరికీ డబుల్ బెడ్రూమ్ ఇండ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తెలిపారు. కార్పొరేటర్ ఆదివారం రహ్మత్‌నగర్ డివిజన్ కమలానగర్ డబుల్ బెడ్రూమ్ గృహాలను సందర్శించారు. ఇండ్లు లభించని వారితో మాట్లాడార